ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

వ్యాలీ వేదిక, అమెరికా వారి నిర్వహణలో

శారదా పీఠ మణి మంజీరం

(అంతర్జాతీయ అంతర్జాల ఏకదిన శతావధానం)

(10 ఏప్రిల్, 2021 శనివారం - జూమ్ వేదికగా)



వ్యాలీ వేదిక – వైవిధ్యం (విభిన్నాంశరి)

శ్రీ ప్లవనామ ఉగాది శుభాకాంక్షలతో...

సభలో:

"అంతర్జాతీయ అంతర్జాల ఏకదిన శతావధానం"

అవధాని

'అవధాన సుధాకర',
'అవధాన భారతి',
'అవధాన భీమ',
'శతావధాని',
శ్రీ రాంభట్ల
పార్వతీశ్వరశర్మ

సంచాలకులు

'అవధాని ప్రభాకర',
'అవధాని వేదండ',
'అవధానవతంస'
శ్రీ నేమాని
లక్ష్మీ నరసింహ
సోమయాజులు

ఏప్రిల్ 10th శనివారం రాత్రి 8:30 IST/ 4pm London Time/2am Melbourne Time(Australia)
(ఏప్రిల్ 10th శనివారం ఉదయం 8:00 PST/10:00 CST/11:00 EST)

Watch LIVE at : www.youtube.com/valleyvedika

'శతావధాన కంఠీరవ'

డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

శారదా పద మణి మంజీరం

అంతర్జాతీయ అంతర్జాల ఏకదిన శతావధాన పద్య పూరణలు

(10, ఏప్రిల్ 2021, శనివారం రాత్రి 8.30 IST, జూమ్ వీడియో కాన్ఫెరెన్స్ వేదికగా)

'శతావధాన కంఠీరవ'

డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ

ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. సంస్కృతం, పిహెచ్.డి.

సహాయాచార్యులు, తెలుగుశాఖ, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం.

2021

వ్యాలీ వేదిక, అమెరికా వారి నిర్వహణలో...

శారదా పద మణి మంజీరం

అంతర్జాతీయ అంతర్జాల ఏకదిన శతావధాన పద్య పూరణలు

(10, ఏప్రిల్ 2021, శనివారం రాత్రి 8.30 IST, జూమ్ వీడియో కాన్ఫెరెన్స్ వేదికగా)

అవధాని : **'శతావధాని' డా. రాంభట్ల పార్వతీశ్వరశర్మ** ఎం.ఏ.తెలుగు, ఎం.ఏ.సంస్కృతం, పిహెచ్.డి.

నిర్వహణ : **వ్యాలీ వేదిక, క్యాలీఫోర్నియా, అమెరికా.**
(youtube.com/valleyvedika)

ప్రచురణ : **23, మే 2021** (**వైశాఖ శుద్ధ ద్వాదశి, ఆదివారం**)

ప్రతులు : **అంతర్జాల ప్రచురణ (ఇ-పుస్తకం)**
(avadhanavidya.com/ekadinasatavadhanam)

ప్రకాశకులు : **డా. రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్, విశాఖపట్నం.**

సర్వస్వామ్యాలు : **ప్రకాశకులవి**

ముఖచిత్రం : **వ్యాలీవేదిక, అమెరికా.**

వెల : **అమూల్యం**

ప్రతులకు : **'శతావధాని' డా. రాంభట్ల పార్వతీశ్వరశర్మ**
జి -1, సరోజినీ ఎన్క్లేవ్, శారదాపీఠం దగ్గర,
చినముషిడివాడ, విశాఖపట్నం - 531173
ఆంధ్రప్రదేశ్, భారతదేశం. సెల్: +91 9247859580

అంకితం

వేంకట రామకృష్ణ కవులు, పిఠాపురం

తే.గీ॥ మూడుగంటల గావించి పూరణముల
ధారణాత్కృష్ట శతావధానులైన
పీఠికాపుర సంస్థాన విబుధులార!
కృతి నొనర్తు వేంకటరామ కృష్ణులార!

మూడు గంటల్లో పూరణ, ధారణలతో 'అత్యద్భుత శతావధానం' చేసిన అపూర్వ ప్రజ్ఞాధురంధరులు పిఠాపురం ఆస్థాన కవులు వేంకట రామకృష్ణ కవులకు సభక్తికంగా...

విషయసూచిక

ముందుమాట : కాశీవఝ్ఝల శారద 05

సంచాలకవాణి : అష్టావధాని నేమాని లక్ష్మీనరసింహసోమయాజులు 08

శతానంద శతావధానం : అష్టావధాని తాతా సంటీలే శర్మ 09

సాహితీపర్వము : శతావధాని గన్నవరం లలితాదిత్య 12

అవధాని అంతరంగం : శతావధాని డా. రాంభట్ల పార్వతీశ్వరశర్మ 13

ప్రస్తావన 14

సమస్యలు 17

దత్తపదులు 27

వర్ణనలు 37

చిత్రాశువ్యలు 47

పత్రికా ప్రచురణలు 55

చిత్రమాలికలు 59

ప్రశంసాపత్రం 60

ముందుమాట

అందరికీ నమస్కారం. 'వ్యాలీవేదిక'ను స్థాపించి ఒక సంవత్సరం పూర్తయ్యింది. ఈ ఏడాదిలో మిగిలిన వినోద, విజ్ఞాన, వికాస కార్యక్రమాలతోపాటుగా రకరకాల అవధానాలను ప్రయోగాత్మకంగా నిర్వహించాం. ముందుగా 'నవాంశ చతుర్గళ అవధానం' చేశాం. తరువాత అందరూ అవధానులే ఉండే విధంగా 'అష్టావధాని అష్టావధానం' ఒకటి చేశాం. తరువాత అవధానులే పృచ్ఛకులుగా శ్రీమతి బాలభాను గారితో 'మహిళా అవధానం' ఒకటి నిర్వహించాం. శ్రీ బండికాడి అంజయ్య గౌడ్ గారితో 'అష్టావధానం' చేశాం. తరువాత 'చతురంశ ఏకపద్య గర్భిత నవావధానం' ఒకటి చేశాం. తరువాత 'నవాంశ చతుర్గళ నవావధానం రీకిండిల్' అని మరొకటి నిర్వహించాం. ఇటీవల నిర్వహించినది **'అంతర్జాతీయ అంతర్జాల ఏకదిన శతావధానం'.** అందులో ధారణాంశాలైన సమస్య, దత్తపది, వర్ణన మూడింటిని ఒకే పృచ్ఛకుడు ఎన్నుకుని, ఒక్కొక్కరూ మూడేసి అంశాల చొప్పున మొత్తం 25 మంది పృచ్ఛకులు 75 ధారణాంశాలను అడిగారు. మరో 25 చిత్రాశువులను నిర్వహించాం. అంటే చూపించిన చిత్రానికి ఆశువుగా పద్యం చెప్పడం. ఇది ధారణేతర అంశం. ఇందులో వేరు వేరు పృచ్ఛకులు ప్రశ్నలుగా వివిధ ఇతివృత్తాలున్న చిత్రాలను అందించారు. ఈ విధంగా శతాంశాలతో... వాటిలో 75 అంశాల ధారణతో 'సంపూర్ణ శతావధానం' ఒక్క రోజులోనే పూర్తయ్యింది. ఇదంతా ValleyVedika యూట్యూబ్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారమైంది.

'అవధానసుధాకర' 'అవధానభీమ', 'అవధానభారతి' ఇత్యాది బిరుదాంకితులు **శతావధాని డా. రాంభట్ల పార్వతీశ్వరశర్మ** గారు ఈ శతావధానాన్ని చేయడం ముదావహం. ఎన్ని ఒత్తిళ్ళు ఎదురైనా ఔచిత్యంతో సభను రంజింపజేస్తూ పూరణలు చేయగలరని ఇది వరకు వారు వ్యాలీవేదికలో చేసిన అవధానాల్లో తేటతెల్లమైన విషయమే. అదే పంథాలో ఏకదినశతావధానంలో గుర్తుండిపోయేలా ప్రతి అంశాన్ని

ఎంతో సుందరంగా అందించారు. పృచ్ఛకులందరినీ అంతర్జాతీయ స్థాయిలో రకరకాల కాలమానాల నుండి తీసుకోవడం వల్ల సమన్వయ పరచడం ఎంతో క్లిష్టమైన విషయం. అదృష్టవశాత్తు సంచాలకులు **'అవధాని వేదండ' నేమాని లక్ష్మీ నరసింహ సోమయాజులు** గారు ఏది ఎలా చేయాలో ఎంతో ఓపికతో చెప్పి సహకరించారు.

పసిఫిక్ కాలమానం ప్రకారం ఏప్రిల్ 10వ తేదీ ఉదయం 9 గం॥లకు మొదలు పెట్టుకున్నాం. మేమనుకున్న దానికంటే నాలుగింతలు వేగం తగ్గి నుడుస్తోందని అర్థమైంది. మొదటి 25 అంశాలకు గంటన్నర పడుతుందని అంచనావేసుకున్నాం. కాని సమస్యాపూరణల మధ్యలోనే, దాదాపు గంటన్నర గడువుదాటింది. దానికి కారణం ఏకదిన శతావధానంలో పృచ్ఛకులు ఎంతో క్లిష్టమైన సమస్యలు తీసుకురావడం ఒకటైతే, వారిలో చాలామందికి వివిధ కాలమానాలలో నిద్రాసమయం కావడమో, గృహసంబంధమైన ఇతరత్రా పనులుండడమో రెండవది కావచ్చును. అందువల్ల పృచ్ఛకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దాదాపు 6–7 గంటల అవిశ్రాంత అవధాన నిర్వహణ తర్వాత నాలో కొంత ఆందోళన కలిగింది. "సాధారణంగా మూడురోజులలో చేసే కార్యక్రమం కాబట్టి ఏకదినంలో జరిగే అవకాశం లేదోమో, ఎంతో పెద్ద విషయాన్ని ఊహించకుండా తలకెత్తుకున్నామేమో" అని అనిపించింది. అవధానం ఆపకుండా మరుసటి రోజుకు వాయిదా వేసుకుని కొనసాగిద్దామని అనుకున్నాం. పృచ్ఛకులకు దాదాపు 3–4 గంటల సమయం నిద్రపోవడానికి తదితర కార్యక్రమాలు చేసుకోవడానికి విరామం ప్రకటించాం.

అయితే అంతలోనే పృచ్ఛకులందరూ కొంత విశ్రాంతి తీసుకుని తిరిగి సిద్ధమవడంతో ఒకేరోజులో శతావధాన్ని పూర్తిచేయాలని మళ్ళీ కొనసాగించాం. అనుకున్నది ఏకదినమే. అవిరామంగా కాదుకదా. అదృష్టవశాత్తు ఈ విరామం తర్వాత ఎంతో ఉత్సాహంతో అందరి సహకారంతో మిగతా కార్యక్రమాన్ని పూర్తిచేసుకోగలిగాం.

అవధాని రాంభట్ల వారి హాస్యచతురత అందరికీ తెలిసినదే. ఎక్కడెక్కడ ఎలా మాటల గారడి చెయ్యాలో అలా చేస్తూ పొందికగా పూర్తిచేసారు. పృచ్ఛకులతో పాటు కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారంగా చూసి ఆస్వాదించిన ఎందరో సాహిత్య అభిమానులు, పండితులు రాంభట్ల వారి పూరణవిధానాన్ని ఎంతగానో ప్రశంసించారు. అవధానులందరూ అమితమైన పాండితీ వైభవంతోనే ఉంటారు. కానీ రాంభట్ల వారు సాధారణ స్థాయికి మించి భాషలోను, పూరణపద్ధతిలోనూ ప్రతిభను ప్రదర్శించారని సభ్యులందరూ మెచ్చుకున్నారు. ఇంతటి ఒత్తిడిలో కూడా ఏదోలా పూరణ చేయడం కాకుండా ఉన్నతంగా, అర్థవంతంగా సరైన రీతిలో న్యాయం చేస్తూ పూరించడం అభినందనీయం. దానికి తోడు కఠిన విషయాన్ని కూడా అందరికీ అర్థమయ్యే భాషలో చెప్పడమనేది నాకు ఆయనలో ప్రత్యేకంగా నచ్చిన విషయం. ఆయన్ని ఆరోజు రాత్రంతా ప్రశ్నలమీద ప్రశ్నలతో.. అప్రస్తుత ప్రసంగాలతో ఎంతో శ్రమపెట్టాం. అయినప్పటికీ ఎప్పటిలాగానే అన్నింటినీ తట్టుకుని అమెరికా కాలమానం ప్రకారం అంతర్జాలంలో 'వ్యాలీవేదిక' మీద 'ఏకదినం'లోనే (14 గంటలలోనే) పూరణ, ధారణలతో సంపూర్ణ శతావధానాన్ని పూర్తి చేసారు. అందుకే విజయోత్సవ సభలో వారిని 'శతావధాన కంఠీరవ' అనే బిరుదుతో 'వ్యాలీవేదిక' సత్కరించింది.

నభూత:కార్యక్రమాలను చేయాలనే నా ఆలోచనను తీసిపారేయకుండా ఎంతో గౌరవించి, ఈ బృహత్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు అవధానిగారికి, సంచాలకులకు, పాల్గొన్న పృచ్ఛకులందరికీ, వేదిక మీద, వెనక తోడ్పడిన ప్రతి కార్యకర్తకీ, శ్రేయోభిలాషులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు.

శారదా కాశీవజ్ఝల
అధ్యక్షురాలు
వ్యాలీవేదిక, క్యాలీఫోర్నియా, అమెరికా.

సంచాలక వాణి

ఉ॥ వాగధిదైవతంబయిన భారతి చల్లనిచూపులొప్పగా
సాగెను భావపూర్ణముగ చక్కగ పూరణలన్ని కాంచగా
వేగ శతావధాన పరివృత్తమొనర్చెను బార్వతీశుడున్
బాగుగ సౌఖ్యసంపదలు వర్ధిల దీవెన లేను బల్కెదన్.

ఉ॥ చక్కని ధారతోడను బ్రశస్తముగా విలసిల్లు పూరణల్
గ్రుక్కను దిప్పకుండగను గూరిమితో నొనరించె ధారణం
బొక్క దినంబునందుననె యొప్పుగ జేయ శతావధానమున్
మక్కువతోడ బల్కెదను మంగళవాక్యము లీవధానికిన్.

కం॥ అవధానిపార్వతీశుడు
భువినందలి సుకవిజనులు పూర్తిగ మెచ్చన్
కవనమ్మును సలిపెంగద
స్తవనీయంబుగ వధాన సమయమునందున్

మత్తకోకిల:

గుర్వుగా విలసిల్లు ధారయు గొప్పభావము లొప్పగా
నుర్విలో నరుదైనరీతిగ నొక్కపూట వధానమున్
పార్వతీశ్వరశర్మ చేసె, శుభమ్ములొందగ కోరెదన్
సర్వదేశజనాళికూడను సత్కృతుల్ వినిపించిరే!

'అవధాని వేదండ'
నేమాని లక్ష్మీనరసింహ సోమయాజులు
జార్జియా, అమెరికా.

శతానంద శతావధానము

అనాదిగా అవధానం అనేది వైదికమైన విద్యయే అయిననూ, తెలుగునాట ఇది విశేషార్థ స్ఫూర్తితో ఒక సాహిత్య విద్యా ప్రదర్శనకు పారిభాషిక పదముగా స్థిరపడిపోయినది. తెలుగు భాషకు మాత్రమే స్వంతమైన ఈ అవధాన ప్రక్రియా శతపత్రము..నవనవోన్మేషిత ధిషణా కిరణ ప్రసారణముచేత క్రొత్తమొగ్గలు వేస్తూ కొన్ని శతాబ్దాల పాటుగా సజీవముగా సాగిపోతూ ఉన్నది. పసగల్గిన ఈ విద్య వసివాడకుండా తమవంతు కృషి చేస్తూ భాషకూ, అవధాన విద్యకూ ఎందరో మహానుభావులు సేవచేస్తూ వచ్చారు. తిరుపతి వేంకటకవులూ, కొప్పరపు కవులూ, గరికిపాటి సరసింహారావు ఇత్యాదులను ఎరుగని వారుండరు. ఆధునిక అవధాన రంగములో శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారు పేరెన్నిక గన్న వారు. మా యువావధాని వర్గములో అగ్రతాంబూలార్హులు. మాకు అన్నగారు. మా మధ్య సారస్వత సహోదరత్వముతో పాటు కొండొకచో బీరకాయపీచు బంధుత్వమూ లేకపోలేదు. జంటగా అవధానాలూ, భువనవిజయాలూ చేశాము.

ఇక ప్రస్తుత శతావధానము విషయానికి వస్తే...ఇది "ఏక దిన అంతర్జాల శతావధానము". నిజానికి కవిత్వము చెప్పడమే చాలా కష్టము. అందునా పద్యకవిత్వము. అందునా అవధానం. అందునా అంతర్జాలం. అందునా అర్ధరాత్రి. ఇలా చెప్పుకొంటూ పోతే "ఉత్తరోత్తరబలీయము"లైన కష్టనష్టాలు ఇందులో చాలానే ఉన్నాయి. 21వశతాబ్ది ప్రారంభములో సాంకేతిక పరిజ్ఞాన ప్రాథమిక దశలో ప్రయోగాలకే పరిమితమైన అంతర్జాల అవధానాలు, కరోనా పుణ్యమా అని పరిణమించి, పరిపుష్టములై, ప్రత్యక్ష ప్రదర్శనకు ప్రత్యామ్నాయములైనవి. వేదిక మీద అవధానము చేయునపుడు ఉండే ఉత్సాహము అంతర్జాల వేదికపై ఉండదు. పైగా అవధాని ఈ దేశములో...సంచాలకులు ఆ దేశములో! చాలా చిత్రముగా ఉంది కదూ! శ్రీ రాంభట్లవారి పూరణలూ అంతే చిత్రముగా ఉంటాయి మరి.

కేవలము ఛందస్సునకు సరిపడు పదాలను కూర్చుకొంటూ సాగిన వ్యవధానం కాదిది. ప్రతిపద రసాన్వితముగా, వివిధ శాస్త్ర పరిజ్ఞాన పరీమళముగా, ఛందోలంకార

నైపుణీ విన్యాసముగా సాగిన సముజ్జ్వల శతావధానమిది. పరిణత కవితాధానమిది. ఇందులో ఏ పద్యము చూసినా ఏదో ఒక నూత్న భావము, వినూత్న ప్రయోగము, ఛందోవైవిధ్యమూ కానవస్తూనే ఉంటాయి. సమస్యలూ, దత్తపదులూ, వర్ణనలూ...ప్రశ్న ఏదైనా పూరణ మాత్రం పదప్రసూన తోరణమే. ధారణ అసాధారణమే. సమస్యల్లో చిక్కుకున్నప్పుడు తమకున్న భారత,భాగవత, రామాయణాది ప్రాచీనాధునికాంధ్రగీర్వాణ కావ్య ప్రబంధ జ్ఞానాన్ని ఉపయోగించుకొని బయటపడ్డ తీరు అమోఘము. ఉదాహరణకు "కన్నులు నాల్గు కల్గి దశకంధరుడేగెను శాంతి దూతయై" అనే సమస్యను వసంతసేనతో శకారుడన్నట్లుగా చెబుతూ "మృచ్ఛకటిక" స్ఫూర్తితో పూరించారు. "కృష్ణను కృష్ణనిన్...." అనే సమస్యలో కృష్ణ శబ్దానికి గలా నాలుగు అర్థాలనూ వాడి పూరించిన విధానము వారి శాబ్దిక పుష్టికి నిదర్శనము. దుష్కరప్రాసలెదురైనపుడు సముద్రలంఘనము గావించిన హనుమంతునివోలె వ్యాకరణ సూత్రాను"సార" ప్రయోగాలతో చాలా సులభముగా అధిగమించారు. దత్తపదిని పూరించడము కష్టము. నేడు ప్రష్టలూ చాలా విచిత్రముగా ఇస్తున్నారు. "శ్యాంసంగ్"ను శ్యామ సంగమముగా, "కేతన"ను "కేతన"ముగా, విరవడం ఒక ఎత్తైతే... "పోతన"ను "కపోత నభోవిహారులనుచు" అని పూరించడము అవధానం మొత్తానికే మకుటాయమానమైన విన్యాసము.

"వర్ణనా నిపుణః కవిః" అన్నారు పెద్దలు. వర్ణనాంశాల్లో తమ కవన చాతుర్యాన్ని ప్రదర్శించడానికి అవధానికి వీలెక్కువ. ఇందులో దిశ చట్టము గురించి, కరోనా క్రిమి గురించి, సామాజిక మాధ్యమాల గురించి, సిమ్హాద్రి అప్పన్న గురించి... ఇలా ఎన్నో వర్ణనలున్నాయి. వసంతఋతు శోభలో కృష్ణస్వరూపాన్ని తిలకించిన రాంభట్ల వారు ఎంత లలితసందీప్తమైన పద్యమల్లారో చూడండి.

ఆ.వె। పికరవమ్ము చూడ వేణు నిక్వాణమ్ము!
పల్లవములు పాదపల్లవములె!
అందమరసి జూడ నానందమందించు
కంతుతండ్రియే వసంతమందు!

ఇక అవధానాన్ని క్రతువుతో పోల్చుతూ చేసిన పూరణ ఈ శతావధాన సవనానికి పూర్ణాహుతి. ఇంతటి ఒత్తిడిలోనూ కూడా ఏమరని అవధాని గారు వర్ణనాంశాల్లో చేసిన పంచచామర, మధ్యాక్కర, వనమయూరాది ప్రయోగాలు వారి చంద:పరిజ్ఞానానికి నిలువుటద్దాలు.

ఇలా చెప్పుకొంటూ పోతే ఈ డెబ్బది అయిదు పద్యాల్లోనూ విశేషాలుంటూనే ఉంటాయి. ఎక్కడో ఒకచోట చుక్కపెట్టాలిగా మరి..! ముగించే ముందు ఇంతటి మహోత్కృష్టమైన అవధాన క్రతువునకు రూపకల్పన జేసి, నిర్వహించిన శ్రీమతి కాశీవర్ఝుల శారద గారిని మనసారా అభినందిస్తున్నాను. "వ్యాలీ వేదిక" ద్వారా సంగీత సాహిత్యాభిమానముతో కార్యక్రమాలనూ, అపూర్వావధానములనూ ఏర్పాటు చేస్తున్నారు. "వస్త్రేణ, వపుషా, వాచా.." అన్నట్లు "వినోదం, వికాసం, విజ్ఞానం, విభావరి, వైవిధ్యం" అనే "పంచ వకరాలతో" సార్థకతను పొందుతున్నారు. సంచాలనము చేసిన శ్రీ నేమాని సోమయాజులు అవధాని గారికి నా నమస్సులు. ఇది నా అనుంగు సోదరడు.. శ్రీ రాంభట్ల పార్వతీశ్వరుని ఆనందపద్యతాండవం.. అపూర్వ అంతర్జాలావధానం.. శతానంద శతావధానం.! అన్నయ్యా అందుకోవయ్య అనుజుని అభినందన.

శా॥ సంభారంబులు గాగ స్వీయ ధిషణా సారస్వతోపాసనల్
సంభావించి మనమ్మునన్ పితరులన్ సందీప్తమౌ రీతిగన్
శుంభద్దివ్యమహావధానకదనాస్తోకప్రభాపూర్ణతన్
రాంభట్లాన్వయ పార్వతీశ్వరకవీ! రారాజువైనావిటన్.

అవధాన అష్టాపద, అవధాన చింతామణి,
అవధాన యువరాట్, ఘంటావధాన ధురీణ

తాతా సందీప్ శర్మ M.Sc, (Ph.D)-BIOTECH, M.A-TEL
రాజమహేంద్రవరం-533104 +91-9032610483.

॥ లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబం ॥

సాహితీపర్వము

"అవధాన సుధాకర" "అవధాన భారతి" మా అగ్రజులు శ్రీ రాంభట్ల పార్వతీశ్వరశర్మ గారు ఏకదినములో సలిపిన శతావధానము శతధాభినందనీయము. రసజ్ఞులు శారదాకటాక్షప్రతిపన్నమైన ఈ సాహితీస్రోతస్వినిని తిలకించి పులకింతురు గాక.

శా॥ చాతుర్యమ్ము జయధ్వజంబు, విలసత్సత్కావ్యపూర్వప్రభల్
నీతివ్యాతతమంత్రివర్గములు, బాణీభూతధైర్యమ్ము ధీ–
మాతంగాశ్వరథాదికాంగతతి స్థేమమ్మొప్ప చేపట్టెగా
జేతృత్వమ్మును పార్వతీశ్వరకవిశ్రేష్ఠుండు పద్యాజిలో.

కం॥ ప్రతిపక్షిప్రశ్నాహుల
ధృతి వాక్–పక్షీశుడగుచు దీటున తాకెన్
సితపక్షకువలయాప్తుని
చతురతతో పక్షాపాతసంగతిలేమిన్

గరుడునికి, చంద్రుడికి పక్షపాతము (రెక్కల చలనము, ఒక పక్షములోతరుగుట)కలదు. కాని కవిచంద్రుడు పక్షపాతములేకుండానే రాణించినాడు.

మ॥ రవి గ్రుంకెన్ కవిభాస్కరుండు కవితారాజన్నభోభాగమ–
ధ్య విరాణ్మూర్తియునై చలింపక యహో! అద్వంద్వుడై సాగెడిన్
నవశోభామృదులాంగుడై పొడమి సన్నద్ధుండునై చంద్రుడున్
ఛవిమత్కావ్యకలావిలాసముల జ్యోత్స్నన్ బంచె సూరీందువున్

"శతావధానశరచ్చంద్ర"
గన్నవరం లలిత ఆదిత్య,
టెక్సస్, అమెరికా.

అవధాని అంతరంగం

వేదికలమీదైతే సాధారణంగా శతావధానాలు మూడురోజుల్లో చేస్తున్నారు. ఇటీవల 'అంతర్జాలం'లో కూడా మూడురోజుల శతావధానం జరిగింది. వైవిధ్యంగా ఒకేరోజులో 100 పద్య పూరణలు చేయడమనే ప్రక్రియ ఇదివరకే ఇటు భారతదేశంలోనూ, అటు అమెరికాలోనూ జరిగింది. అయితే **అంతర్జాల వేదికగా ఒక్కరోజులో శతావధానం** నిర్వహించాలనేది **శారద కాశీవజ్ఝుల** గారి ఆకాంక్ష. అదికూడా ఈ ప్లవ నామ ఉగాది సందర్భంగా జరగాలని వారి తపన. కొన్ని రోజుల ముందు నాతో ఆ మాట చెప్పారు. **నేమాని లక్ష్మీనరసింహసోమయాజులు** గారు సంచాలకులుగా ఉండడానికి అంగీకరించారని తెలిసింది. పృచ్ఛకుల ఎంపిక, వివిధ కాలమానాలలో ఉండే వారిని సమన్వయపరచడం, అంశాల నిర్ణయం, వాటిని అడిగే క్రమం, పూరణ ధారణల పద్ధతి... ఇలాంటి మిగతా కథంతా సంచాలకుల వారి కసరత్తుతో, శారదగారి సహనంతో చకచకా ముందుకునడిచింది.

ఇది నా రెండవ శతావధానం. మూడు గంటల్లో వేంకటరామకృష్ణకవులు అత్యద్భుతశతావధానాన్ని చేసారని చదువుకున్నాను. ఎందుకో ప్రయత్నించాలని అనిపించింది. కాలమానపరిస్థితుల వల్ల ఏకదినంలో చేయాలని నిశ్చయించుకున్నాను. అందరూ ఆశీర్వదించారు. మా అన్నయ్య **డా. రాంభట్ల వేంకటరాయశర్మ** ఎంతగానో ప్రోత్సహించి ఈ అవధానంలో నాకు వెన్నుదన్నుగా నిలిచి, 'సూర్యోదయానికి నిర్మలాకాశం'లా నా విజయానికి దోహదం చేసాడు. పృచ్ఛకులందరూ క్లిష్టమైన ప్రశ్నలే అడిగారు. నేను కూడా సాధ్యమైనంత వరకు ఔచిత్యవంతంగా పూరించడానికి ప్రయత్నించాను. అవధానాన్ని చేయించిన **'వ్యాలీవేదిక'కు**, సంచాలకులకు, పృచ్ఛకులకు, లేఖకులకు, వీక్షించి ఆదరించిన అశేష ప్రేక్షకులందరికీ నా ధన్యవాదాలు.

'శతావధాన కంఠీరవ'
డా. రాంభట్ల పార్వతీశ్వరశర్మ

ప్రస్తావన

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో... విఘ్నేశ్వర, సరస్వతి, వేదమాత గాయత్రి, శ్రీవేంకటేశ్వర స్వామి, ఇలువేలుపులను స్తుతించి, అమ్మానాన్నలను, అవధానగురువైన పితామహుని, దీక్షాగురువులైన కుర్తాళమ్ జగద్గురు, శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామివారిని, శ్రీధూళిపాళ మహాదేవమణిగారిని ప్రణుతించి, మార్గదర్శకులైన ఆచార్యసార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారికి, ఆచార్య మలయవాసిని గారికి, పరిశోధనలో జ్ఞానభిక్షను పెట్టిన ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రిగారికి నమస్కరించి, అవధానవిద్యావరిష్ఠులను సంస్తుతించి.. బంధుమిత్రశ్రేయోభిలాషుల ఆశీస్సులను అందుకొంటూ...

సీ॥ అష్టావధానమ్ము లాచరించుటయన్న
వెన్నతో పెట్టిన విద్యనాకు;
ఆశుధారాపాత హాసభాషణమన్న
కదళీఫలోద్భుక్తకమ్ము నాకు;
పదరాజితో నాట లెదతోటలో ఊసు
లాడుట చిననాటి యాట నాకు;
పలికిన దానిని వదలక చివరకు
నప్పజెప్పుటయే పెద్దమెప్పునాకు;

తే.గీ॥ కావ్యరాశుల జ్ఞానమ్మె కడలినాకు;
వ్యాకృతుల్ స్వరక్త ప్రవాహమ్ము నాకు;
సొమ్ము వినయమ్మె ఆభిజాత్యమ్ము నాకు
అమ్మ శారద భద్రమ్మునరయు కతన!!

సీ॥ శతవధానమొకటి సల్పుటయేదక్క
అంతకు మించి లే దనుభవమ్మె;
అష్టావధానమ్ము లాచరించుట దక్క
అంతకు మించి లేదధిక యశము;
కృతుల మేటిగ నొండు రెండు కూర్చుట దక్క
అంతకు మించి లే దార్జనమ్ము;
పెద్దలందరు జేరి 'భేష' నుటే దక్క
అతిశయించిన పురస్కృతులు లేవు;

తే.గీ॥ అమ్మ ఆశీస్సులందించి ఆదుకొనగ
నాన్న నాకమ్మునందుండి నన్ను గనగ
గురుల సేసల నవధాన వరపథాన
వరలుచున్నాడ ! **'పార్వతీశ్వరుడ'** నేను!!

శా॥ గాంద్రంబెట్టు సమస్యలన్ దునిమి సంఘట్టించు వేదండమై!
పండ్రెండున్ నెలలేని పద్యరచనావ్యాహార వ్యాపార; మే
మం ద్రాభారతి సేవనారతిని? సమ్మాన్యావధానిన్! బుధున్!
తండ్రిన్ బోలిన **'సోమయాజిని'** సభన్! దర్శించి కీర్తించెదన్!

ఉ॥ **'శారద'** శారదామయ విశారదయై! సుకవిత్వ ప్రీతిచే
శారదసాంద్రచంద్రవిలసన్నవకౌముది బోలు పద్యముల్
పూరణ ధారణాయుతవిభూతి విధాన శతావధానము
త్ప్రేరకమై చెలంగెనిట విజ్ఞులు మెచ్చగ **'వ్యాలివేదికన్'**

ఉ॥ తుచ్ఛముకాని ప్రశ్నములతో తగ దుందుడుకొప్ప వేదికన్!
పృచ్ఛకులార! భావ పరివేష్టిత హస్తశరాసనస్థులై!
ఇచ్ఛచరించి మీప్రతిభ నీ సభ దెల్పుడు; నన్ను గాచు నా
కచ్ఛపమూర్తియే భరముగాంచి, యొనర్ప శతావధానమున్!!

సమస్యలు

శ్రీవేంకటేశ్వరాయనమః

సమస్యలు

1. డా. జోశ్యభట్ల రాజశేఖర్, హైదరాబాద్, భారతదేశం.

శారదకు బాధ కలుగగ శాంతి మనకు

తే.గీ॥ చేయ నష్టావధానమ్ము స్థిరము మీర
నంశములయందు భావమ్ములందగింప
నందు నప్రస్తుతమ్ముగా నమరియున్న
శారదకు బాధ కలుగగ శాంతి మనకు.

2. నల్లాన్ చక్రవర్తుల కిరణ్ (నచకి), హైదరాబాద్, భారతదేశం.

రామమందిరమ్ములేల రాక్షసుల యుపేక్షలో

ఉత్సాహ: శ్రీమహాహరిన్ కనంగ సిద్ధరూపుడౌ భువిన్
క్షేమమున్ దలిర్పగా ప్రకీర్తికాంత భర్తయై
ఈ మహిన్ వరింపవచ్చె – నెంచ జాలు హృద్ధ్వనిన్
రామమందిరమ్ములేల రాక్షసుల యుపేక్షలో.

3. డా. శేషం సుప్రసన్నాచార్యులు, హైదరాబాద్, భారతదేశం.

కన్నులు నాల్గు గల్గి దశకంధరుడేగెను శాంతిదూతయై!

ఉ॥ అన్నులమిన్నయైన మృదులాంగన చెంత వసంతసేనకున్
మన్నన చేయు భంగి మొహమాటపు మాటల మాటగాడిగా
ఎన్నో విధాల పల్కెనిటు నెన్నగ బేల! శకారుడక్కటా!
"కన్నులు నాల్గుగల్గి దశకంధరుడేగెను శాంతిదూతయై!"

4. శశకళ నేమాని, లండన్.

గద్వాల ప్రభవాగ్ని కాల్చెగద లంకాపట్టణంబున్ వడిన్!

శా॥ ఉద్వేగంబున తారకాపథమునందుత్సాహమేపారగా
విద్వన్మూర్తి శుభప్రయాణ గరిమన్ వేగంబుమై జేరి, శ్రీ
మద్విఖ్యాత మహీజగాంచె పయినన్ మండించె క్షిప్రాశు రం
గ – ద్వాల ప్రభవాగ్ని, కాల్చెగద లంకాపట్టణంబున్ వడిన్!
(రంగత్ – వాల)

5. రామకృష్ణ నేమాని, లండన్.

ధనమే ముఖ్యమటంచు నేర్పవలె విద్యాబుద్ధులన్ సద్గురుల్!

మ॥ వినుడోయంచు హితోపదేశమున తా విన్పించె నారాయణుం
డనయంబున్ నరుడొందుచున్ ఘనముగా నార్జింపగా ద్రవ్యమున్
కనగా లేవు! జరామృతుల్! సతమదే కాంక్షించి – లబ్ధిన్ గొనన్
ధనమే ముఖ్యమటంచు నేర్పవలె విద్యాబుద్ధులన్ సద్గురుల్!

6. డా. వేంకట శ్రీనివాస్ పులి, ఫ్లోరిడా, అమెరికా.

పరుల హితంబు గోరెడు కృపామయుడే పతితుండు నాదగున్!

చం॥ స్థిరమతి యౌచు సేవలిడి, చెయ్వుల మంచినొనర్చి యెంతయున్!
కరము ధనార్తులన్ గనుచు కామితముల్ నెరవేర్చుచుండినన్!
పరులను త్రెళ్ళజేయక యపాయము నెంచక యున్న – "ఎన్నికన్"
పరుల హితంబు గోరెడు కృపామయుడే "పతితుండు" నాదగున్!

7. చంద్రశేఖర్ ఉపాధ్యాయుల, లండన్.

గాడిదనెక్కి శంకరుడు గంగను గైగొనిపోయె కాశికిన్!

ఉ॥ ఏడుకునేండ్లు మాట! తరియింపగ ముక్తిపథంబు భార్యయే
తోడుగ గంగరాగ నొక తోరపు భక్తుడు గుర్రమొక్కటిన్
బాడుగనాగ తెచ్చె, నది పారగ, చేసెడిదేమిలేకయే
గాడిదనెక్కి శంకరుడు గంగను గైగొనిపోయె కాశికిన్!
('శంకరుడు అనే భక్తుడు తన భార్య గంగతో' అనే కల్పనాత్మకంగా)

8. కృష్ణ వేదుల, జార్జియా, అమెరికా.

విషమును త్రాగె మాధవుడు వింతగుచున్ పరమానురక్తితోన్!

చం॥ కృషిగని దేవదానవుల కింకను మాన్పగ నాదిదేవుడే
విషమును త్రాగె; మాధవుడు వింతగుచున్ పరమానురక్తితోన్
ధిషణ చెలంగ మోహినిగ దివ్యసుధారస మొప్పుగా భళీ!
సుషమ వహింప దేవతల సొత్తుగ జేసె శుభౌచితీక్రియన్!

9. వేణు దశిగి, ఫిలడెల్ఫియా, అమెరికా.

వార్ధక్యంబున ప్రేమగీతి పలికెన్ వాత్సల్యముప్పొంగగాన్!

శా॥ దోర్ధీరత్వము సన్నగిల్లె, పలుకున్ దోషప్రయుక్తంబునై
నిర్ధారింపగలేక రాజ్యరమనే, నిద్రించు నిశ్చేష్టుడై,
వర్ధిష్ణున్ సుతునిన్ యయాతియడిగెన్ ప్రాయంబు-పూరుండిడన్
వార్ధక్యంబున ప్రేమగీతి పలికెన్ వాత్సల్యముప్పొంగగాన్!

10. సత్యనారాయణ మూర్తి మధిర, ఫ్లోరిడా, అమెరికా.

రాముడుగాదు రాముడట రామచరిత్రను చూచినంతటన్

ఉ॥ ధీమహితత్త్వమున్ చెలగ దిక్కులయందున శాంతినిండగా
ప్రేమయె శాశ్వతంబని వరింపగ సత్యము బోధసేసె; నే
మేమి వచించినన్ 'పిఠకమే'యని యందు తథాగతుంగనున్
రాముడుగాదురాముడట – రామచరిత్రను చూచినంతటన్!

11. రోహిత్ ఆదిపూడి, జార్జియా, అమెరికా.

వాగ్జ్యోతిన్ వెలిగించి దానవుడు సంపాదించె వాణీకృపన్!

శా॥ సృ గ్ర్యాముక్త విశేష వాక్కులనగా క్షేమంబుమై గూర్చు; ద్యో
ది గ్జ్యో తిష్యమునందు నొజ్జయగుచున్ దీవ్యత్ ప్రభారాశిచే;
వాగ్జ్యోతుల్ వెలిగించె శుక్రుని గనన్ భవ్యంబునౌ నీతితో;
వాగ్జ్యోతిన్ వెలిగించి దానవుడు సంపాదించె వాణీకృపన్!

(సృక్+జ్యా, ద్యోదిక్+జ్యోతిష్య)

12. సురేశ్ కొలిచెల, జార్జియా, అమెరికా.

వాని పేరట సారంగధరుండు రాడటపదే రమ్మంచు ప్రార్థించినన్

(ఛందోగోపనం)

మ॥ జటలన్ గల్గిన వాని, జన్మ నుడుపన్ జాలంగ దక్షుండునౌ
నిటలాక్షున్, పతిగాగ కోరుకొనుచున్ నిష్కాగరిష్కాత్మయై
జటిలంబైన తపస్సునన్ గిరిజ – యోజన్ పిల్చెనే – వాని పే
రట "సారంగధరుండు" రాడట పదే రమ్మంచు ప్రార్థించినన్!

13. శ్రీనివాస భరద్వాజ కిశోర్ (కిభశ్రీ), జార్జియా, అమెరికా.

అత్తను నమ్మబోకుమని అవ్యయుడే తన జామితోననెన్!

ఉ॥ "చిత్తము నందునుండు, తన చిత్తము మెచ్చెడు భంగి నేగు, నై
మిత్తిక కర్మలన్ గనగ మిశ్ర ఫలంబుల నిచ్చుచుండు, నా
'విత్తము'గా గుణాగుణ సువీక్షణముల్ 'రమ' యెంచదంచు మీ
అత్తను నమ్మబోకుమని" 'అవ్యయు'డే తన 'జామి'తో ననెన్!
(విష్ణుమూర్తి తన భార్య లక్ష్మిగురించి కోడలు సరస్వతితో)

14. శ్రీనివాసరావు అయినాపురపు, వాషింగ్టన్ డి.సి., అమెరికా.

భార్యను కష్టపెట్టుటయె భర్తకు ముఖ్యము మెప్పునందగాన్!

ఉ॥ భార్య భరించునట్టిదని భాగ్యవతంసులు చెప్పవింటి, యా
భార్య దధి ప్రమాణయయి భారముచే నవనీతమిచ్చు, యా
భార్యయె కష్టకాలమున భర్తకు దన్నుగ నిల్చియుండు, త
ద్భార్యను కష్టపెట్టుటయె భర్తకు ముఖ్యము మెప్పునందగాన్!
(కష్టకాలంలో భార్య అన్నీ తానై సమర్థంగా ఎదుర్కొంటుంది)

15. రమాకాంతారావు చాకలకొండ, హైదరాబాద్, భారతదేశం.

రామభక్తులలో మేటిరతనాలు రాజత్రయముమించురాజులేరి? (మహోక్కర)

భీమయుద్ధంబు చేయగా వరలె విభీ**ష**ణున్ మించిన యొకడులేడు;
స్వామి వాహిని దాటింప నావలో **స**ద్భక్తిచూపిన జాణలేడు;
ధీమహత్వము నిండగా కపులచే **దే**విని వెతకించు దిట్టలేడు;
రామభక్తులలో మేటిరతనాలు **రా**జత్రయము మించు రాజులేరి?
(విభీషణుడు, గుహుడు, సుగ్రీవుడు)

16. హరనాథ్ గానుగపాటి, న్యూజెర్సీ, అమెరికా.

కృష్ణను కృష్ణునిన్ మరియు కృష్ణునిజూచితి భారతంబునన్!

ఉ॥ కృష్ణుడనంగ నర్జునుడు – కృష్ణయె ద్రౌపదియౌ నెఱింగినన్
కృష్ణుడనంగ వ్యాసుడట; కృష్ణమయంబగు నేత్రపర్వమా
కృష్ణ కథాంకురమ్ము పరికింపగ నా 'జయ' కావ్య; మట్లుగా
కృష్ణను కృష్ణునిన్ మరియు కృష్ణునిజూచితి భారతంబునన్!

17. శఠగోపన్ శ్రీవాత్సవ శేషం, క్యాలిఫోర్నియా, అమెరికా.

మక్కాబోవలె వేంకటేశ్వరునికిం సంప్రీతిగా మ్రొక్కగన్!

శా॥ "ఇక్కట్లెన్నియొ గల్గగా, ముడుపులందివ్వంగ నా స్వామికిన్
చక్కంబెట్టెడు నాథుడంచు కడితిన్ స్వాంతంబు రంజిల్లగా
నక్కో! యెయ్యెడ బెట్టినావు? గొనితేవమ్మా వెసన్ ముడ్పు! రా
మక్కా! బోవలె వేంకటేశ్వరునికిం సంప్రీతిగా మ్రొక్కగన్!"

18. శ్రీ రామచంద్రరావు తల్లాప్రగడ, క్యాలిఫోర్నియా, అమెరికా.

ఆత్మగరుత్ముండయ్యె నాశ్చర్యముగన్!

కం॥ ఆత్మీయులెల్ల జేరుచు
నాత్మారాముండు నలర నతినందమిడన్!
నాత్మగృహమ్మును జేరగ
ఆత్మగరుత్ముండయ్యె నాశ్చర్యముగన్!

19. పుల్లెల శ్యామసుందర్, క్యాలిఫోర్నియా, అమెరికా.

క్రుళ్ళిన వంకాయ మేలు కూరకునెపుడున్!

కం॥ అల్లారు ముద్దుసేయక
పళ్ళెరమున కూర సర్దు పద్ధతి తెలుపన్
ఇల్లాలిని పతియిటులనె
క్రుళ్ళిన వంకాయ మేలు కూరకు, నెపుడున్!

20. కృష్ణకుమార్ పిల్లలమఱ్ఱి, క్యాలిఫోర్నియా, అమెరికా.

అన్నయు దమ్ముడున్ బెనగ నాతురజెందిరి శక్రగోపకుల్!

ఉ॥ వెన్నుడు కేలనెత్తగను వేడుకతో గిరినిల్చు తేవకున్
పన్నమునట్లు రాళ్ళు తెగ వర్షమునట్లుగ నేగుదెంచగా
మిన్నును భూమియున్ కలియ మిక్కిలి ఘర్షణమంద చూడగా
నన్నయుదమ్ముడున్ బెనగ నాతురజెందిరి శక్రగోపకుల్!

21. కిరణ్ సింహాద్రి, క్యాలిఫోర్నియా, అమెరికా.

ఎలుక వధించె నేనుగు నహీన బలంబున విక్రమించుచున్!

చం॥ చెలగ మహారణంబు విరచించిన యట్టి పరప్రవాహినిన్
అలుగులు ఖడ్గధారల నొకానొక వీరుడు బాలచంద్రుడున్
కలియగజొచ్చి చంప 'నలగాముని', చంపె 'నృసింహరాయనిన్'!
ఎలుక వధించె నేనుగు నహీన బలంబున విక్రమించుచున్!

22. శ్రీధర్ బిల్ల, క్యాలిఫోర్నియా, అమెరికా.

రామపదము తాకి నాతి రాతిగమారెన్!

కం॥ కామక్రోధములెల్లడ
స్వామీ పెల్లుబికెననుచు సంవేదనతో
నీ మహి కలియుగమందున
రామపదము తాకి నాతి రాతిగమారెన్!

23. సుబు భాగవతి, జార్జియా, అమెరికా.

కాశ్మీరంబున వెన్నెలల్ గురిసెగా కంజాప్తునిన్ గాంచినన్!

శా॥ రశ్మిన్ గ్రక్కుచు గ్రీష్మతాపమున నుగ్రావస్థతో భానుడే
అశ్మంబుల్ చెదరంగజేయ నకటా! ఆర్తుల్ వ్యధల్ నిండెనే
కాశ్మీరంబును మోది మోదమిడగా కల్పింగదా భారతిన్
కాశ్మీరంబున వెన్నెలల్ గురిసెగా కంజాప్తునిన్ గాంచినన్.

24. ఆదిత్య ధవళ, లండన్.

హనుమంతుడు పెండ్లియాడె నవనిజ సీతన్!

కం॥ ఒనరంగ రామనవమికి
కనులకు పర్వంబు రామకళ్యాణంబే!
వినువీథి భజన సలుపగ
హనుమంతుడు, పెండ్లియాడె నవనిజ సీతన్!

25. డా. చింతలపాటి మోహన మురళీ కృష్ణ, ఆస్ట్రేలియా.

అస్ఖలిత బ్రహ్మచారి కార్గురుపుత్రుల్!

కం॥ అస్ఖలితుండన సతియెడ
నే స్ఖలనము వలన పుత్రినిన్ గొనగను వీ
ర్యస్ఖలనము చేయునతడె;
అస్ఖలిత బ్రహ్మచారికార్గురు పుత్రుల్!

దత్తపదులు

దత్తపదులు

1. డా. జోశ్యభట్ల రాజశేఖర్, హైదరాబాద్, భారతదేశం.

శ్రీ, అభేరి, బృందావని, చారుకేసి – రామకృష్ణులకు అభేదం.

తే.గీ॥ చూడ **శ్రీ**లనొసంగుచు సూన్నతముల
ఒప్పె **బృందావని**న్ తా నయోధ్యగాని
చారుకేశీ విలాసాల సారు మీర
విష్ణుడే! రామకృష్ణు**ల! భేరి** మ్రోగ!

2. నల్లాన్ చక్రవర్తుల కిరణ్ (నచకి), హైదరాబాద్, భారతదేశం.

శామ్‌సంగ్, జియో, ఒప్పో, వివో – రామాయణార్థం.

తే.గీ॥ **శ్యామసంగ**మమెంచగా నమరుడయ్యె
ఆ**జి యో**ర్పు వహింపగ రాజవరుడు
తప్పు**నొప్ప**ని జెప్పక తమ్ముడరిగె
ధర్మ ర**వివో** యటంచు తత్ప్రజలు పొగడ

3. డా. శేషం సుప్రసన్నాచార్యులు, హైదరాబాద్, భారతదేశం.

లండను, జపాను, సీత, కుంతి (వేంకటేశ్వర కల్యాణం)

కం॥ కే**లండని** తలచినదో
ఆలుగను **జపాను**వృత్తయై శ్రీహరి నే!
లీలగు శ్రీ**కున్ తీ**రుగ
గ్రోలిన దా **సీత** యగుచు కొండలరాయున్
(సీత = ఆకాశ గంగ)

4. శశకళ నేమాని, లండన్.

అతలము, వితలము, సుతలము, తలాతలము(ఇంద్రసభలో దేవతలచర్చ)

కం॥ **అతలము** భూలోకమునకు,
వితలము నీలోకమునకు, వెరసి వచింపన్
సుతలము సద్భువనమునకు,
సతము **తలాతలము** సమము స్వర్గమ్మునకున్!

5. రామకృష్ణ నేమాని, లండన్.

పాలు, మీగడ, పెరుగు, వెన్న (రామాయణార్థంలో)

కం॥ భూమీ! **గడ**గడ వడకకు
భూమీ**పాలు**డు శివధనువును నెక్కిడగా!
ఆ మహి ప్రా **పెరుగు**మ ధులి
స్వామీ తా**వెన్న** నహియు సామర్థ్యముతో!

6. డా. వేంకట శ్రీనివాస్ పులి, ఫ్లోరిడా, అమెరికా.

నీర, సార, బీర, రార (మద్యపాననిషేధం)

కం॥ **బీర**మ్ముల విడనాడుచు
మారాడక నాయకాళి మన**సార**ంగా!
రారండో మద్యము విడ
నీ రమ్యపథమ్ము వలదె యెల్ల ప్రజలకున్!

7. చంద్రశేఖర్ ఉపాధ్యాయుల, లండన్.

బాలు, బాపు, రమణ, వేటూరి (సినిమా ఇతివృత్తం)

తే.గీ॥ పాడ గాంధర్వముం**బాలు** పంచుగొనుచు
'వలదు జనభాష' యను పేరు **బాపు**గొనుచు
చెలగె కీర్తికి **రమణు**డై చిత్రములను
రమ్య **వేటూరి** సుందరరామమూర్తి!

8. కృష్ణ వేదుల, జార్జియా, అమెరికా.

కరి, మకరి, హరి, సిరి (రామాయణార్థంలో)

కం॥ రవిదివ్య కుల**కరీం**ద్రుడు
ధవుడయ్యెను స్థే**మకరి**కి ధాత్రీ సుతకున్
అవతారమొంద **హరి**యే
స్తవమున తని**సిరి** కనుగొని సర్వసుపర్వుల్

9. వేణు దశిగి, ఫిలడెల్ఫియా, అమెరికా.

కొంగు, పొంగు, అంగ, మంగ (స్త్రీల ఔన్నత్యం)

కం॥ **కొంగు**న్ బంగరులన ను
పొంగున్ గద మహిళలనగ పుడమి సతంబున్!
అంగడుల వస్తువేమొకొ?
మంగళములనిచ్చువారు మానినులెలమిన్!

10. సత్యనారాయణ మూర్తి మధిర, ఫ్లోరిడా, అమెరికా.

గ్రహ, గృహ, అగ్రహ, అనుగ్రహ (మంచి మాటలు)

కం॥ గ్రహియింపుడు ని**గ్రహ మా**
గ్రహమును వేపొందకుండ ననిశము ధరలో
గృహమేధి యగుచు మనుజుడు
సహ**నానుగ్రహము** పొంది సార్థకుడగుతన్!

11. రోహిత్ ఆదిపూడి, జార్జియా, అమెరికా.

బైడెన్, పుతిన్, జాన్సన్, ఇమ్రాన్ (మోదీ నాయకత్వం-అభివృద్ధి)

కం॥ పీడల్ బోవగ **బైడెన్**
కూడన్బెట్టంగ **పుతిను** గుణ సైనికులన్!
వీడని సంస్కృతి **జాన్సను**
క్రీడల **నిమ్రాను** చూడ కీర్తింతురయా!

12. సురేశ్ కొలిచెల, జార్జియా, అమెరికా.

కర్ణ, వర్ణ, పర్ణ, పూర్ణ (మయసభ వర్ణన)

కం॥ **వర్ణ**ములుండియు నుండవు
కర్ణములన్ నిండు గీత గణనిక్వణముల్!
వర్ణింప న**పర్ణా** సతి
పూర్ణంబుగ కొల్వుతీరు భువి మయసభలో!

13. శ్రీనివాస భరద్వాజ కిశోర్ (కిభశ్రీ), జార్జియా, అమెరికా.

తిక్కన, కేతన, పోతన, వేమన (ఆధునిక యువతి పోకడ)

తే.గీ॥ కనగ **తిక్కన** రాదయ కల్మషముల (తిక్కం అనగ)
విజయ **కేతన**మెగురంగ విజయలగుచు
పుణ్య మంది క**పోత న**భోవిహార
లగును కాన**వే మన** క్రొత్త యతివ ప్రగతి!

14. శ్రీనివాసరావు అయినాపురపు, వాషింగ్టన్ డి.సి., అమెరికా.

వేప, చెరకు, మామిడి, మిరియము (రామాయణార్థంలో)

మత్తకోకిల. కాన**వే ప**లు బాధలన్ బడె కర్మధారిగ విష్ణుడే
మానినిన్ **చెఱకున్** విధింపగ మాయి దానవనాథుడే
ధీనతుండయి రాక్షసాళియె త్రెళ్ళ తి**మ్మిరి య**మ్ములన్!
మానవాకృతిజేసె స్వామి! న**మామి డి**ంభక మాత్రుడన్!

15. హరనాథ్ గానుగపాటి, న్యూజెర్సీ, అమెరికా.

చిగురుబోడి పదంతో (అమెరికా అతివల వర్ణన)

తే.గీ॥ చేయు వంటల నేర్పుమై **చిగురుబోడి!**
నిర్వహించును కార్యముల్ నిష్ఠతోడ!
అతి వదాన్యలె నమెరికా అతివలనిన
దత్తపదముల గూర్చితి చిత్తమలర!

16. రమాకాంతారావు చాకలకొండ, హైదరాబాద్, భారతదేశం.

పింగ, లింగ, బింగ, సింగ (శ్రీలక్ష్మి, భూ, నీల, బీబీనాంచారి, అలిమేలుమంగా సహిత వేంకటేశ్వర స్వామివారి వర్ణన)

తే.గీ॥ **పింగ**లాస్తోక వస్తుడై వేంకటేశు
డనయ మా**లింగ**నమొనర్చె నమ్మవార్ల
పెక్కు వా**సింగ**నెన్ స్వామి వీరి వలన
బింగముల్ రత్నములు దాల్చి వెలుగు నతడు!

17. శఠగోపన్ శ్రీవాత్సవ శేషం, క్యాలిఫోర్నియా, అమెరికా.

నాన్న, కన్న, బాబు, బుజ్జి (యశోదాదేవి కృష్ణుణ్ణి నిద్రలేపడం)

కం॥ **కన్నా**రగ **బాబూ**యని
మున్నరయని తోషమందు **బుజ్జి** తనయుచే!
అన్నువుతో శ్రీకృష్ణుని
చెన్నుగ **నాన్నా** యటంచు చెయ్యుల లేపున్!

18. శ్రీ రామచంద్రరావు తల్లాప్రగడ, క్యాలిఫోర్నియా, అమెరికా.

రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న (కృష్ణ రాయబారం)

కం॥ పగకు వి**రామ**ంబిడవలె
నొగి శుభ **లక్ష్మణ**ములందు నొప్పెడు పొత్తున్
తగ విది **భరత** కులేశా!
సగమిచ్చుట మేలు రమణు **శత్రుఘ్న** సుధీ!
(శ్రీకృష్ణుడు దుర్యోధనుడితో)

19. పుల్లెల శ్యామసుందర్, క్యాలిఫోర్నియా, అమెరికా.

చర్చి, యేసు, మేరి, సిలువ (సరస్వతీప్రార్థన)

తే.గీ॥ శాస్త్రములయందు **చర్చి**ంప శారదాంబ!
తెలియు గుణ**మేరి**కన్ చూడ దివ్య కృతుల!
ఆమె**యే సు**పూజిత! కన నన్నిదిశల
పలుకురాదని గా**సిలు వ**గలు వలదు.

20. కృష్ణకుమార్ పిల్లలమఱ్ఱి, క్యాలిఫోర్నియా, అమెరికా.

సామీప్య. సాన్నిధ్య, సారూప్య, సాలోక్య (మోక్ష సాధన)

తే.గీ॥ అంద **సారూప్య**మున్ జపమరయు చుండ్రు
నిలువ **సామీప్య**మున గుడుల్ నిలుపు చుండ్రు
కీర్తనమ్ముల **సాన్నిధ్య**వర్తులగుచు
కడకు **సాలోక్యు**లై భక్తి గాంత్రు ముక్తి!

21. కిరణ్ సింహాద్రి, క్యాలిఫోర్నియా, అమెరికా.

జాతి, మత, కుల, ప్రాంత (ప్రస్తుత సమాజ శాంతి)

తే.గీ॥ మతము ముఖ్యము గా దభి**మత**మె గాని
సం**కుల**ంబైన భావాల పంకిలముల
జాతి జాతి యటన్న వి**జాతి** యేల?
ప్రాంతభేదముల్ విడనాడ శాంతి గలుగు!

22. శ్రీధర్ బిల్ల, క్యాలిఫోర్నియా, అమెరికా.

ఎద్దు, నాగలి, రైతు, పైరు (గయోపాఖ్యానం)

కం॥ **ఎ** ద్దుర్మతి నిష్ఠీవన
మిద్దోసిలి వేసె**నా** **గలి**ం దగ గయునిన్
పెద్దగ నెదు**రై** **తు**నకల
నెద్దరి యుద్ధమును **పై** **రు**చింపగ జేతున్!

23. సుబు భాగవతి, జార్జియా, అమెరికా.

కాల, కాల, కాల, కాల (సదాశివుడి వర్ణన)

తే.గీ॥ **కాల**జేయుచు పాపముల్ గ్రాలునతడు
కాలకంఠుడునై స్ఫూర్తి లీలజూపు
చూడ **కాల** స్వరూపుడై వేడుకొప్ప
అట్టి **కాలా**హిమ త్ఫాణునంజలింతు!

24. ఆదిత్య ధవళ, లండన్.

భువి, రవి, కవి, దివి (కరోనాలో జనుల కష్టాలు)

కం॥ **భువి** మడియు కృచ్ఛ్రదశగా
రవిజూచెడి యాశలేని ప్రజల వ్యథార్తుల్!
కవికలముల నుదయించెను
దివికేగ "కరోన"వ్యాధిదీనస్థితులే!

25. డా. చింతలపాటి మోహన మురళీ కృష్ణ, ఆస్ట్రేలియా.

మహర్షి, పోకిరి, మహేశ్, అతడు (రామాయణార్థంలో)

అతడిచ్చె మంత్రమొక్కటి
వితతముగ **మహర్షి**యైన విశ్వామిత్రుం
డతుల **మహేశా**నుడనన్
క్షితిగొనె **పో! కిరి**య పిదప శ్రీ రాముండై!

వర్ణనలు

వర్ణనలు

1. డా. జోశ్యభట్ల రాజశేఖర్, హైదరాబాద్, భారతదేశం.

చిత్రాల్లో అనారోగ్య హాస్యం – మాలిని వృత్తంలో.

మాలిని॥ కనుమ కనుమ వింతన్! కాంచుమా చిత్రవృత్తిన్!
కనగ గొనమె భ్రాంతిన్! కాలపున్ లేకి రూపున్!
అనగను పలుమార్లున్! హాస్యమే ఖేదమిచ్చున్!
మనసు విరుపుటేలన్! మాన్యమౌ చిత్ర వీథిన్!

2. నల్లాన్ చక్రవర్తుల కిరణ్ (నచకి), హైదరాబాద్, భారతదేశం.

ఆడవాళ్ళకి రక్షణ – మగవాళ్ళకి బుద్ధులు

కం॥ దిశయను చట్టంబొక్కటి
దిశల యెడల నండనిడుచు తెగ ధైర్యమిడన్
నిశి వేళనైన ప్రొద్దుల
శశిరేఖగ నతివలెల్ల చరియింపవలెన్!

3. డా. శేషం సుప్రసన్నాచార్యులు, హైదరాబాద్, భారతదేశం.

'కరోనా' క్రిమికి కల్యాణంచేస్తే ఎలా ఉంటుంది?

తే.గీ॥ అంతరిక్షమునందున వింతపుట్ట
నచటికై నీవునేగుమా యరుగుమనుచు
నంపకమ్ముల క్రిమినిట్లు పంపిరేని
కంటకమ్ములు దీరు నేయింటజూడ!

4. శశకళ నేమాని, లండన్.

సోషల్మీడియాను ఆరోభూతంగా వర్ణించాలి

ద్విపద॥ భూత ప్రభూతమ్ముపూతమ్ము గూడ
చూతమా జాలికన్ చోద్యంబులెన్నొ
సామాజికంబైన సామగ్రి కూడ
ఏ మాత్రమున్ చెడ్డ నెట్టెట్లుజేయు!

5. రామకృష్ణ నేమాని, లండన్.

తిరుపతి వేంకటేశ్వరస్వామి మహిమలు

తే.గీ॥ ముడుపు గట్టిన చాలును మ్రొక్కులనగ!
కాసులొసగిన చాలును గాంచునతడె!
ఏడుకొండల రాయుడై వేడువారి
ఆర్తులన్‌దీర్చు కలియుగ ఖ్యాతుడగుచు!

6. డా. వేంకట శ్రీనివాస్ పులి, ఫ్లోరిడా, అమెరికా.

సింహాద్రి అప్పన్న

మత్తకోకిల॥ చందనోత్సవ వైభవంబున జాతరన్ జనులందరున్
సుందరాకర వందనంబని చూడగా నిజరూపమున్
వందలాదిగ చేరరే తగ భక్తులెల్లరు కొండకున్
డెందముల్ పులకింపగా గరిడీల ద్రిప్పుచు సాగరే!

7. చంద్రశేఖర్ ఉపాధ్యాయుల, లండన్.

'కరోనా' కష్టకాలంలో వైద్యసిబ్బంది, ముందుశ్రేణి సిబ్బంది పాటవం.

తే.గీ॥ పరుడు సరిహద్దులో నిల్చి పగ రగిల్చి
యుద్ధ సంసిద్ధతన్ దెల్ప నొప్పు రీతి
వరలె నొక్కొక్కడు నొక సిపాయి యనగ
వైద్యులున్ పారిశుద్ధ్యాధిపతుల గూడి

8. కృష్ణ వేదుల, జార్జియా, అమెరికా.

అయోధ్యలో రామనవమి

కం॥ రాముని మందిరమొక్కటి
రామాంకితమనగ గట్ట రామజపమునన్
క్షేమంకరమై యొప్పును
రాముని యీ నవమి వేడ్క రాజొచ్చెనదే!

9. వేణు దశిగి, ఫిలడెల్ఫియా, అమెరికా.

అనాథను పెంచిన తర్వాత, పెంచినవాళ్ళు తల్లిదండ్రులు కాదని తెలిసాక అతని మానసిక పరిస్థితి.

ఆ.వె॥ 'తల్లిదండ్రులకట తమదారులం బోవ
నన్ను విడిచె నే ననాథనైతి'
ననుచు బాధనొందు నరయంగ నానాడు;
బంధుజనులు గలుగ బాధలేల!

10. సత్యనారాయణ మూర్తి మధిర, ఫ్లోరిడా, అమెరికా.

కేదారనాథుడి గుడికి వెళ్ళే దారిలో ప్రకృతి సౌందర్యం.

కం॥ సెలయేళ్ళ దుముకులాటల,
కలహంసల ధ్వనుల, శిల్పకారుల ప్రతిభల్!
చలిపెంచు శీతనగ-రమ
వెలయున్ కేదారయాత్ర విబుధులు మెచ్చున్!

11. రోహిత్ ఆదిపూడి, జార్జియా, అమెరికా.

జంతుజాలంలో మానవుడి స్థానం

కం॥ ఆహారము గొన, నరుడును
తా హాయిగ నిద్రవోవ, తనర భయము నం,
దూహింపగ రతులందున
"సోహం"బన పశువు- వీడుచో ధర్మంబున్!

12. సురేశ్ కొలిచెల, జార్జియా, అమెరికా.

వసంత ఋతుశోభలో కృష్ణుడి రూపం.

ఆ.వె॥ పికరవమ్ము చూడ వేణు నిక్వాణము!
పల్లవములు పాదపల్లవములె!
అందమరసి జూడ నానందమందించు
కంతుతండ్రియే వసంతమందు!

13. శ్రీనివాస భరద్వాజ కిశోర్ (కిభశ్రీ), జార్జియా, అమెరికా.

శునకాలు – ఆధ్యాత్మిక భావన.

తే.గీ॥ కాలకంఠ స్వరూపమై క్రాలుచుండి
"భైరవాభిద"మై పెక్కు పలుకులందు
రక్షణన్ గూర్చుచుండెడు రక్షకుండు!
భైర వుండాతడున్! కాలభైరవుండు!

14. శ్రీనివాసరావు అయినాపురపు, వాషింగ్టన్ డి.సి., అమెరికా.

అవధానాన్ని క్రతువుతో పోలుస్తూ.

తే.గీ॥ ఆతతమ్ముగ నవధాని హౌత యైన,
ప్రశ్నసమిధలనందించు ప్రష్టలెల్ల,
రగ్గులై భావజాలంబులావహింప,
ప్రేక్షకులు హవ్యమును గ్రోలు వేల్పులైరి!

15. హరనాథ్ గానుగపాటి, న్యూజెర్సీ, అమెరికా.

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ.

మధ్యాక్కర॥ అక్కరల్ జెప్పగా నతడె, యందు నీరాజనంబెపుడు!
లెక్కకున్ మించగా కృతులు, లేరుగా సామ్య మింకెవరు!
ఇక్కయై జ్ఞానపీఠమ్ము, నెక్కగా శ్రీరామకథను!
అక్కవిన్ సమ్రాట్టు గొల్తు, నవధానమునయందు నేడు.

16. రమాకాంతారావు చాకలకొండ, హైదరాబాద్, భారతదేశం.

వజ్రకిరీటంతో శోభిల్లే వేంకటేశ్వరస్వామి సుందరరూపం.

వనమయూరం॥ భాసమయ రత్నచయ వజ్రమకుటంబున్
వాసిగొన లక్ష్మి హృది వాసిగను జేసెన్
ఆ సరములై కుసుమ హారములు నిండన్
ధ్యాసగను భక్తులకు దర్శనమునిచ్చున్

17. శఠగోపన్ శ్రీవాత్సవ శేషం, క్యాలిఫోర్నియా, అమెరికా.

జాటాయువు రావణుడి వర్ణన.

కం॥ "పదితలల రావణుడు నను
కదలక పోరాడ ఖడ్గ ఘాతుని చేసెన్
సుదతిని గొనిచనె సీతను
పదపడి కార్యంబుచూడు" వర! శ్రీరామా!

18. శ్రీ రామచంద్రరావు తల్లాప్రగడ, క్యాలిఫోర్నియా, అమెరికా.

బాల్యస్నేహితులు వృద్ధాప్యంలో కలిస్తే.

కం॥ ఆటలు తిళ్ళును స్మృతులై
మాటలలో చెప్పలేని మాన్యస్థితిగా
దాటించు కాలమును చిన
నాటి గురుతులెల్ల చేరు నవ్యములనగా!

19. పుల్లెల శ్యామసుందర్, క్యాలిఫోర్నియా, అమెరికా.

తెలుగు భాషా సేవలో యువ కవుల పాత్ర

తే.గీ॥ పద్యరచనయందు ప్రౌఢత్వమున్ పొంది
వర్ణనములజేయ భావమరసి
సేవజేయవలయు చేతనన్ యువశక్తి
భాష కొరకు! మనదు భావికొరకు!

20. కృష్ణకుమార్ పిల్లలమఱ్ఱి, క్యాలిఫోర్నియా, అమెరికా.

సినీదర్శకులు రాఘవేంద్రరావు-పళ్ళతో జీవనసాఫల్యపురస్కారం

ఆ.వె॥ "దోసపళ్ళ" తోటి దుస్సాలువను చేసి
"చూతఫలపు" మాల పోతపోసి
సాకి రాఘవేంద్రు "సాఫల్య"మను పేర
పొసగ "నూజివీడు రసము" లిడుడు!

21. కిరణ్ సింహాద్రి, క్యాలిఫోర్నియా, అమెరికా.

'కరోనా' - 'సెకెండ్ వేవ్' ను బాలారిష్టాలతో పోలుస్తూ.

(9 నెలల లాక్ డౌన్ 9 నెలల గర్భస్థపిండం)

కం॥ నవమాసంబుల బంధము
స్తవనీయము మాతృగర్భ సౌభాగ్యమునన్!
అవనీజన మకటకటా!
నవబాధల్ పడిరి - వ్యాధి నరకము జూపన్!

22. శ్రీధర్ బిల్ల, క్యాలిఫోర్నియా, అమెరికా.

అవధాని శుక్రుడైతే – బలిచక్రవర్తిని దానమివ్వవద్దని ఎలా ఒప్పిస్తారు?

కం॥ "రమ గలుగు విష్ణుమూర్తియె
శమియింపగ రాజ్యరమను సన్నద్ధుండై
గమియించె గుజ్జు రూపున
సమసింపకు వాని యిచ్ఛ సలుపగను బలీ!"

23. సుబు భాగవతి, జార్జియా, అమెరికా.

ఈగ 'కాలు' (పాదం)

కం॥ రోగముల కాలవాలము,
వేగమున చరించుచుండు పెడద్రోవలలో,
మూ గీగ కాలు చూచిన
రాగల కాలుండు గురుతు రావలెనయ్యా!

24. ఆదిత్య ధవళ, లండన్.

విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు

కం॥ చిక్కుల చిక్కినదక్కట
ఉక్కు పరిశ్రమను జూడు మోయీ ప్రష్టా!
'హక్కని' పలికెను నాడే
చక్కగ 'తెన్నేటి' వారు సమభావనతో!

25. డా. చింతలపాటి మోహన మురళీ కృష్ణ, ఆస్ట్రేలియా.

ప్లవనామ నూతన వర్ష వర్ణన.

పంచచామరం॥

ద్రవించె నేగె శార్వరీ విదారకంబుగా కటా!
నవీనమైన భావనల్ మనస్సునందు నిల్పగా
శివమ్ము శంకరమ్ముగా వసింపుమా ప్లవాభిధా!
ప్లవించకుండ నూత్నవర్ష భాగ్యముగ్గడించుమా!

చిత్రాశువ్యలు

చిత్రాశువ్యలు

1) ఆదిత్య ధవళ.

కోలనొక్కట మత్స్యమున్ కూలనేసి
బలపరీక్షను నెగ్గిన పార్థవరుడె
ఆలిగా పొందె నాడు పాంచాలసుతను
కాంత గాదది వీరుని కాన్కయగును!

2) పిళ్ళా వేంకట రమణ మూర్తి

చూచువేళల చిత్రాల వేచి వేచి
కొంత నిద్రించినంతనె కొసరు కెసరు!
పుస్తకమ్ములు చేతిలో పుచ్చుకొనిన
చివరి పుటనిల్చు చూడ – నీ చిత్రమటుల.

3) యశ్వంత్ ఆలూరి.

కదలి పదములు పాటను కొగిలించె
స్వర సుసప్తకమొక్కటై స్వాగతించె
లలిత పదముల నాథుడు "రామశాస్త్రి"!
కలితకీర్తివిభామతి కాడె "బాలు"!

4) సీతామహాలక్ష్మి కాకాని.

ఉమ్మడి కుటుంబమనగా
నమ్మయు నమ్మమ్మ గూడి రన్నయుచెల్లిన్
సమ్ముదమున వేడ్కన్ గని
నెమ్మదిలో మెచ్చుకొనెడు నేర్పరి తనమౌ!

5) రాధిక నోరి.

సక్రమముగ పేర్చిన దీ
చక్రవ్యూహంబొ! లేక శతపత్రమొ! త్రై
విక్రముని చేతి కుదురయి
అక్రమముల నణచివేయు నాయుధమిదియే!

6) డా. ఎం. ప్రవీణ్ కుమార్ ఆచార్య

గాంగేయు డాహముడుపగ
గంగను దెప్పించె నరుడు కదనమునందున్
మంగళమయునిన్ గౌరవ
సంగమ్మున నిలిపె సవ్యసాచియె తలపన్

7) పద్మజ శొంఠి

చెలగునట్టి క్షుద్ర జీవిక యేనియు,
కపియు నేని, పక్షి కవయునేని
రామ సేవలోన రాణించి తరియించె
అట్టి రామచంద్రు నాత్మ దలతు

8) విజయ్ రెడ్డివారి

కులములేదు మతము గూడంగ నదిలేదు
జాతి భేదమనెడు క్షణము లేదు
నేడు జగమునందు పీడయై వ్యాపించె
ముక్కు మూసుకొనెడి యిక్కటొకటి

9) విజయ జ్యోతి.

తండ్రి చెంతనుండి తరియించు భీష్మునిన్
చూచి మురిసె గంగ చోద్యపడుచు!
తండ్రి సుతునికేలు తగబట్టి చూపెట్టు
గొప్ప సంద్రమిద్ది చెప్పుకొనగ



10) జగదీశ్, చికాగో.

తల్లి యాది గురువు తగనేర్పు వర్ణాలు,
తండ్రి పిదప కరపు దైవ భక్తి,
శిక్షణంబు పూని సేవించు వారికి
ఆదిదేవులగుచు నలరు వారు

11) వాసు విశ్వనాథ.

చూడదు భూతమ్మొకటి
పోడిమి వినదొకటియొకటి భుజియింపదునున్
వీడక సందేశమ్ముల
వీడదటా గ్రంథముఖిని వేరొకటదియే!



12) సురేశ్ సోమయాజుల

లోకావృతమై చెలగెడు
కాకుత్థుని రమ్యచరిత కావ్యంబనగా
లోకులకు నందజేసిరి
ఆ కామితమూర్తి గొలుతు నానందమయున్!

13. శారదా మల్లావజల

భేదము లేదని తెలుపగ
వాదములన్ దైవములకు వచ్చిరి యదిగో!
శ్రీదయిత యన్నపూర్ణయు
నా దర్శనమిచ్చె హరుడు నవనీశుండున్

14. సాయి ప్రభాకర్ ఎర్రాప్రగడ.

స్వర విపంచి నినాదించు సవ్యసాచి
కచ్ఛపిన్ గల మెట్లను గౌరవింప
కనగ జేరెను బ్రహ్మ లోకమును "బాలు"
మధుర మోహన గీతాలు మనన జేయ

15. ప్రసాద్ తుర్లపాటి.

పుండ్రముల స్వామి మోహనమూర్తి యగుచు
కలియుగమ్మున వెలసిన ఘనుడతండె
ఆర్తులను దీర్చి కాపాడు నఘవిదారి
అలర పట్టుడు మ్రొక్కుచు నతని దారి

16. ఈశ్వరి కొమరిగిరి.

అదెయె శివాలాస్యముగా
వదనమ్మున హావభావ వర్చస్సమరన్
పదిలంబొనరించెడి యీ
సుదతియె నర్తించువేళ సూనృతమనగా

17. కృష్ణ కొమరగిరి.

ఎచట నుండు జుగుప్స తానచటనుండు
నందమనియెడు రీతిగా నందగించి
ఎచట నుండునొ బాధ తా నచట నుండు
సౌఖ్యమను సూక్తి తెలిపెడు సత్యమిదియె!

18. గాయత్రి తాడేపల్లి.

కల్యాణ రామమూర్తిని
కల్యాణిని సీత జూడ కల్యాణమ్మే
కల్యాణప్రియులకు భువి!
కల్యాణమయమ్ము గాదె కన చిత్రమ్మే!

19. అనిల్ చింతలపాటి

తాళి గట్టెడు శుభవేళ తలచు కొనగ
బంధు విప్పుడు దరిచేర వలదటంచు
ఆంక్ష లున్నట్టి వేళలో కాంక్షదీర
జాలవేదిక కొలువు కాజాలె జూడ

20. గిరిజా కుమారి.

మంచి చెడ్డల నేర్పును మమత తోడ
మాతృమూర్తియే సంతతి మనసులెరిగి
యట్టి తల్లికి నందించి హస్తయుగము
సుదతు లొప్పారె డానంద శోభ యదియె!

21. అరవింద పప్పు

వింతలలో వింతగునిది
అంతయు పరికించి జూడ నగు వృక్షమ్మే
ఇంతగు కళ్ళం గల్గిన
పొంతనగల చిత్రరాజమున్ నుతియింతున్

22. మధు చెరుకూరి.

పాత్రల నిష్టము గలిగిన
పాత్రుడిగా నెంచె భార్య పతినిటు జేసెన్
చిత్రమ్మున నాత్రముతో
సూత్రమ్మగు బాపుగారి శుభహాస్యమునన్

23. విజయ్ రెడ్డివారి

జరుగు చుండె నిపుడు శతవధానమ్ముగా
అందజేయ ప్రశ్నలందుకొనగ
వేయి పనుల తోడ వీక్షింప మిన్నగా
నదిగొ శారద యట నలరుచుండె!

పత్రికాప్రచురణలు

Sathavadhanam in 14 hours!

RANI DEVALLA
VISAKHAPATNAM

AT 33, Rambhatla Parvatheeswara Sarma achieved a rare feat by completing Sathavadhanam in just 14 hours.

A little ahead of Ugadi, the young Sathavadhani performed the most complex literary programme at the 'International Online Ekadina Sathavadhanam'.

Hosted by Valley Vedika, California, the unique literary programme saw 'pruchakas' (questioners) from US, Australia and the UK, among other countries. The live streaming garnered thousands of views.

Sathavadhani Rambhatla Parvatheeswara Sarma

From 'Samsung, Jio, Oppo and Vivo' to 'London, Japan, Seetha, Kunthi' and 'Athadu and Maharshi, Pokiri and Mahesh', the pruchakas shared toughest clues with the Sathavadhani. "The clues were converted into poems based on Ramayana, Srinivasa Kalyanam, among other themes. They were tough but staying calm and recalling the content as fast as I could aided in cracking even the most difficult clue," says Sarma.

Back in 2015, when he presented a live Sathavadhanam, it was for three days. "However, presenting 25 'samsyas' 25 'dattapadis', 25 'varnanas' and 25 'chitra padyams' in 14 hours is certainly challenging. But despite the pressure and limited time, I was able to remain focused on concept presentation," he elaborates.

An alumnus of Andhra University, Sathavadhani completed his MA in Sanskrit, MA and Ph.D in Telugu literature, a subject which is close to his heart. Weaving a poem out of thin air and recapitulating 100 poems is no mean task. But for Sarma, the skill comes naturally to him. "My late grandfather was the first person to spot my ability. He was a poet. I grew up listening to his poems and learning from him. I lost my father at a very young age. My grandfather and my mother R Kameswari encouraged me to pursue my passion," shares Sarma.

Explaining the advantages of avadhanam, he says that it is an art that aids in enhancing one's focus, logical thinking and retention power.

With the online classes gaining pace in times of the pandemic, Sarma says that he intends to reach out to a larger audience at global level through his avadhanams.

ఏయూ తెలుగుశాఖలో ఎంఏ, పీహెచ్‌డీలను పూర్తిచేసిన పూర్వ విద్యార్థి, పరిశోధకుడు శతావధాని డా. కాంధళ్ల పార్వతీత్వర శర్మకు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వమైన గుర్తింపు లభించింది. "స్వనామ" ఖ్యాతి సందర్భంగా "వ్యాలీ వేదిక" - కాలిఫోర్నియా, అమెరికా వారి నిర్వహణలో "అంతర్జాతీయ అంతర్జాల ఏకదిన శతావధానం అనే అత్యంత క్లిష్టమైన సాహిత్య క్రీడను సమర్థంగా ప్రదర్శించి, పొత్త రికార్డుతో విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారి ప్రశంసలందుకున్నారు.

జూమ్ వీడియో సమావేశం ద్వారా అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం 8 గంటలనుండి - (భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 9 గంటలనుండి) దాదాపు 14 గంటలపాటు ఈ శతావధానం జరిగింది. ఇందులో సంచాలకులుగా "అవధాన వేదండ" వేమూరి అష్ట్ర నరసింహ శరుయోజులు వ్యవహరించారు. నిష్ణాతులైన పండితులు పృచ్ఛకులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇండస్, ఆస్ట్రేలియా ఇంకా ఇతర యూరోపియన్ దేశాల నుండి పాల్గొన్నారు.

క్లిష్టప్రశ్నలతో, అరుదైన ఛందస్సులతో, చిత్ర విచిత్రమైన ప్రశ్నలతో అవధానిని పరీక్షించారు. 25 సమస్యలు 25 దత్తపదులు, 25 వర్ణనలు, 25 విభక్తులు ఇలా నాలుగు విభాగాలలో మొత్తం 100 అంశాలను అవధాని పార్వతీత్వర శర్మ అత్యాశువుగా పూరించారు. పలవరాయలుద్దంగా వాటిలో 75 ధారణాంశాలను చివరలో దాదాపు 40 నిముషాలలో తిరిగి యథాతథంగా ధారణ చేసి సభను అచ్చెరువొందించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

చిత్రమాలికలు

అవధాన చిత్రమాలికలు

వ్యాలీ వేదిక, అమెరికా వారి నిర్వహణలో...

ప్రశంసాపత్రం

శ్రీరస్తు
జలిల గంభీర గీర్వాణ పలిమయుండ తెలిక పదాల తూగిడు తెలుగు యుండ
ధారణాదీక సంస్కృతాంధ్రవిధైన పార్వతీశ్వరుని ధారయే పద్యగంగ!
దీకితేశాల స్మ్రక్తివైదమయ్యి పొందితిపతితలకు స్పపాలమయ్యి
నుకవి పౌరాణిక యవధాని కలబోత రామభట్ల కవియకాద రామచంద్ర!
అవధాన ప్రక్రియలో కొత్త ప్రయోగాలు చేయాలన్న ప్రయత్నాన్ని ప్రోత్సహించి,
అనేక కాలమాన ప్రశ్నకుల ప్రశ్నలకు ఒకే రాత్రిలో రమ్యమనోహరముగా పూరించి,
సఫలత "అంతర్జాతీయ అంతర్జాల ఏకదిన శతావధానము"ను దిగ్విజయంగా పూర్తిచేసిన
డాక్టర్. రాంభట్ల పార్వతీశ్వరశర్మగారిని అభినందిస్తూ "శతావధాన కంఠీరవ"
విరుదముతో సన్మానించడమైనది.
కాశీవజ్ఝల శారద
అధ్యక్షురాలు, Valley వేదిక
ఏప్రిల్ 10 2021, శనివారం

పదో యేట నుండే పద్యంరాయడంలో పరిశ్రమచేస్తూ పదహారేళ్లవయస్సు లో అష్టావధానాన్ని చేసిన యువావధాని, "అవధాన సుధాకర", "అవధాన భారతి", "అవధాన భీమ", "అవధానకిశోర", "అసమాన ధారణాధురీణ" "నవయుగావధాని" "క్షేమేంద్ర సారస్వత సరస్వతి" "అవధానకేసరి" "అవధాన శేఖర", "శతావధాన కంఠీరవ"

"శతావధాని" డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ

"అక్షరలక్ష" గాయత్రీ మహామంత్రోపాసకులు **లక్ష్మీ నరసింహ సోమయాజులు, సూర్యకాంత కామేశ్వరి** దంపతులకు 1988లో శ్రీకాకుళంలో జన్మించారు. తాతగారు **పార్వతీశ్వరశర్మ**గారి నుండి అవధానవిద్యను అభ్యసించారు. వీరి కుటుంబమంతా కవులు, పండితులు, సాహితీవేత్తలే. 16వ ఏటనే "అష్టావధానాన్ని" చేసి అందరి మెప్పులు పొంది అందర్నీ ఆశ్చర్యపరిచిన దిట్ట. ఇప్పటివరకు 79 అష్టావధానాలతో మేడసాని, మాడుగుల, నరాల, గరికిపాటి, కడిమిళ్ళ, కోట, పాలపర్తి, వద్దిపర్తి, జి.ఎమ్.రామశర్మ వంటి అవధానదిగ్గజాల ప్రశంసలందుకున్న ప్రతిభామూర్తి.

డిగ్రీ వరకు చదువుకున్నది సైన్స్ అయినా తెలుగులో, సంస్కృతంలో ఎం.ఏ.లను పూర్తిచేసారు. ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రవిశ్వవిద్యాలయంలో "యూజీసీ" వారి "ఫెలోషిప్"తో ఆచార్యులు **"అద్వైతసిద్ధిరత్నాకర" మద్దులపల్లి దత్తాత్రేయశాస్త్రి** గారి పర్యవేక్షణలో క్షేమేంద్రుడి "ఔచిత్యవిచారచర్చ"మీద ప్రీతితో **"తెలుగు ప్రాచీనపంచకావ్యాలు – ఔచిత్యం"** అన్న పరిశోధనతో పీహెచ్.డీ. పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను పొందారు.

2015, నవంబరులో విశాఖ "కళాభారతి"లో మూడు రోజులపాటు **"శతావధానం"** చేశారు. లెక్కకు మించిన ప్రసంగాలు... దూరదర్శన్, ఆకాశవాణిలోనూ వీరు నిర్వహించిన ఆశుకవితా ప్రదర్శనలు ప్రేక్షకులకు, సాహిత్య శ్రోతలకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంటాయి.

భారతభూమిలోనూ, అమెరికాలోనూ ఎన్నో బిరుదులు వీరిని వరించాయి. జాతీయ అవార్డులు, ప్రభుత్వం వారి ఉగాది పురస్కారాలు, వివిధ విశ్వవిద్యాలయాల సన్మానాలు ఎన్నో అందుకున్నారు. సాహిత్యరంగంలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్న పార్వతీశ్వరశర్మ **ఆకాశవాణి 'ఎఫ్ఎం రెయిన్‌బో' లో 'ఆర్‌జే' శర్మ**గా ఉత్తరాంధ్ర శోతలకు సుపరిచితులు. **శ్రీ రాంభట్ల వేంకటీయం, మొదటిమొగ్గలు, ప్రతిభాస్వరాలు, శతావధానభారతి** మొదలైన గ్రంథాలు రచించారు. ప్రస్తుతం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఐఐఐటి శ్రీకాకుళంలో – తెలుగుశాఖలో సహాయాచార్యులుగా సేవలందిస్తున్నారు.